క్లుప్తంగా

ఘనంగా నూకాంబిక విగ్రహ ప్రతిష్ఠాపన


అన్నదానం చేస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం అరుంధతినగర్ కొండవాలు ప్రాంతంలో శుక్రవారం నూకాంబిక అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సుమారు 2 వేల మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె.కామేశ్వరి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ధర్మాల ఆనంద్‌కుమార్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వసంతల అప్పారావు, స్థానిక మహిళలు, ఆలయ ప్రతినిధులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అన్ని విధాలా ప్రోత్సాహం


బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో సంపంగి శ్రీనివాసరావు

సీతమ్మధార: బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు అన్ని విధాలా అండగా ఉండి ప్రోత్సహిస్తానని సింహాచలం దేవస్థానం ట్రస్ట్ మెంబర్ సంపంగి శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని ఎస్‌ఎంపీ హైస్కూల్ మైదానంలో శుక్రవారం మైక్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో మొదటి వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన కేక్ కట్‌చేసి బాక్సింగ్ క్రీడాకారులకు పంచిపెట్టారు. చిన్నారులకు ఉచితంగా బాక్సింగ్ నేర్పిస్తున్న కోచ్‌లను అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు బాక్సింగ్‌లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బొమ్మాళి రవి, జగన్, సురేష్, చంద్రశేఖర్, రవీంద్ర, కిరణ్, హెడ్ కోచ్ హరీష్, సహాయకుడు దినేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతుల సమర్పిస్తారు.

ఉత్సాహంగా చదరంగంలో శిక్షణ


చెస్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చదరంగం క్రీడా శిక్షణ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. శుక్రవారం అత్యధిక సంఖ్యలో బాలబాలికలు శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. చదరంగం శిక్షకుడు సనపల ఉమాపతి మాస్టారు చెస్ క్రీడలోని వివిధ రకాల మెళకువలను పిల్లలకు నేర్పించారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి పి.చెల్వరాజు పర్యవేక్షణలో శిక్షణ జరుగుతోంది.

మీలో ఒకడిని.. మీ సేవకుడిని

- అవకాశమివ్వండి.. శభాష్ అనిపించుకుంటా...
- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు



45వ వార్డు వాసుదేవనగర్‌లో.. తాటిచెట్లపాలెం బజార్‌లో స్థానికులను ఓటు అడుగుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: 'ఉత్తర నియోజకవర్గంలో గెలిచిన టీడీపీ ఎమ్మెల్యే ఈ ఐదేళ్లు మీకు మొహం చూపలేదు. ఇన్నాళ్లు మీలో ఒకడిగా ఉంటూ, మీ సేవలోనే ఉన్నాను. మీ ఓటుతో మరింత సేవ చేసే భాగ్యం కల్పించండి' అని ప్రజలను వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు కోరారు. జీవీఎంసీ 45వ వార్డులో శుక్రవారం సాయంత్రం డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా నిర్వహించారు. లక్ష్మీనారాయణపురం, వాసుదేవనగర్, వైఎస్సార్ నగర్, తాటిచెట్లపాలెం బజార్, గణేష్‌నగర్, తారకరామానగర్, గురునాథరావు కాలనీ, ప్రశాంతినగర్, రామచంద్రనగర్, చిట్టిబాబు కాలనీ, సంతోషమాత కాలనీ, సోనియాగాంధీ నగర్, ఏఎస్సార్ నగర్ ప్రాంతాల్లో కె.కె.రాజు ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలనను వివరించారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని అభ్యర్థించారు.


లక్ష్మీనారాయణపురంలో కె.కె.రాజుకు గజమాలతో స్వాగతం పలుకుతున్న కార్పొరేటర్ కంపా హనోకు, పైడి రమణ

పూర్తి మద్దతుతో గెలిపించండి

సీఎం వైఎస్ జగన్ సహకారంతో ఐదేళ్లలో రూ.435 కోట్లతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని కె.కె.రాజు తెలియజేశారు. మరింత అభివృద్ధి జరగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలంతా పూర్తి మద్దతిచ్చి, అత్యధిక మెజారిటీతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఒక్క అవకాశమివ్వండి.. ప్రజలు మెచ్చుకునేలా అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, వివిధ కార్పొరేషన్ల చైర్‌పర్సన్, డైరెక్టర్లు పిల్లి సుజాత, ఆనంద్‌సింగ్, డైరెక్టర్లు రాయుడు శ్రీనివాసరావు, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, గరికిన గౌరి, హరివెట్నాయక్, సన్ని, ఆదిలక్ష్మి, నేపాల్ శ్రీను, కారుకొండ రాజు, పలువురు పార్టీ నాయకులు, ఆయా కాలనీల నాయకులు, పెద్దలు, పార్టీ అభిమానులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందాం

సీతమ్మధార: జీవీఎంసీ 23వ వార్డు ప్రియదర్శిని కాలనీలో శుక్రవారం కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, సత్యారెడ్డి ఆధ్వర్యంలో కాలనీ పెద్దలతో కలిసి వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా ఆయనకు స్థానిక మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ఐదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించాలని, రెండో సారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో తనను గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచార కార్యక్రమంలో 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ జి.వి.రమణి, కర్రి మురళీకృష్ణారెడ్డి, గుడ్ల అశోక్ రెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

'ఉత్తర'లో రూ.1,500 కోట్ల పెట్టుబడులు


పోర్టు స్టేడియంలో వాకర్స్‌కు ఉత్తరలో చేపట్టిన అభివృద్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతంపేట: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్ రాజుతో కలిసి శుక్రవారం ఉదయం పోర్టు స్టేడియంలో మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్‌తో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో ఉత్తర నియోజకవర్గంలో రూ.400 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. రూ.1,500 కోట్ల పెట్టుబడితో ప్రముఖ కంపెనీ రహేజా గ్రూప్ ఆధ్వర్యంలో కైలాసపురం రోడ్‌లో ఇనార్బిట్ మాల్, ఐటీ టవర్, భారీ కన్వెన్షన్ హాల్ నిర్మిస్తున్నట్టు చెప్పారు. వీటిద్వారా 15 వేల మంది స్థానికులకు ఉపాధి కలుగుతుందన్నారు. భవిష్యత్‌లో మరింత అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో తనను గెలిపించాలని వాకర్స్‌ను కె.కె.రాజు కోరారు. కరపత్రాలు అందజేసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో ఏపీ సిక్కు కార్పొరేషన్ చైర్మన్ ఆనంద్ సింగ్, డైరెక్టర్లు, నాయకులు రాయుడు శ్రీను, కె.సుశీల, బల్ల శ్రీను, ఎం.సునీల్, అంబటి శైలేష్, పార్టీ సీనియర్ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ముస్లింలకు సముచిత స్థానం


వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును సత్కరిస్తున్న ముస్లింలు

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడిచిన ఐదేళ్లలో ముస్లింల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేశారని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 26వ వార్డు చిన్నూరు మసీదు వద్ద శుక్రవారం ముస్లింలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల పదవులు, ఉద్యోగాల్లో ముస్లింలకు సముచిత స్థానం కల్పించారన్నారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓటేసి వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. అనంతరం ముస్లిం పెద్దలు కె.కె.రాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉత్తర ఎన్నికల పరిశీలకుడు బాణాల శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ బులుసు జగదీష్, అనురాగ్, నవాబు, ఖాజా, యూసఫ్, ఇస్మాయిల్, ముస్లిం యువత, స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం ఆచార్యులు కె.రాజమాణిక్యం రచించిన 'బియాండ్ ట్రెడిషన్స్- థామస్ దళిత ఫెమినిజం అండ్ ద ఛాలెంజ్ డిస్పారిటీస్ ఇన్ సౌత్ ఇండియన్ సొసైటీ' అనే పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయితను ఆయన అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, చీఫ్ వార్డెన్‌లు ఆచార్య ఎ.కె.ఎం.పవార్, ఆచార్య వినుత తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి బీజేపీ, జనసేన శ్రేణులు


వైఎస్సార్‌సీపీలో చేరిన బీజేపీ, జనసేన పార్టీల యువకులతో ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు


వినయ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కె.కె.రాజు

'ఉత్తర'లో బలపడుతున్న కె.కె.రాజు

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు బలపడుతున్నారు. రోజురోజుకూ ఆయనకు మద్దతు పెరుగుతోంది. బీజేపీ, జనసేన పార్టీల నుంచి 24వ వార్డు గాంధీనగర్‌కు చెందిన పలువురు యువకులు శుక్రవారం కె.కె.రాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ ఉత్తర కార్యాలయంలో వారికి ఆయన కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీలో ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, ముప్పల సంతోష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ రాజీనామా.. పార్టీలో చేరిక

జీవీఎంసీ 24వ వార్డు క్రాంతినగర్‌లో వలంటీర్‌గా పనిచేస్తున్న వినయ్ రాజీనామా చేసి శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ కార్యాలయంలో ఆయనకు ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

'ఉత్తర'లో 17 నామినేషన్ల ఆమోదం

- ఏడు తిరస్కరణ
- ఆర్వో అఖిల వెల్లడి

సీతమ్మధార: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా విశాఖ ఉత్తర నియోజకవర్గ అసెంబ్లీ స్థానానికి దాఖలైన మొత్తం 47 నామినేషన్లలో 17 పత్రాలకు ఉత్తర ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ డి.అఖిల ఆమోదం తెలిపారు. అర్హత లేని 7 నామినేషన్లను నిబంధనలను అనుసరించి తిరస్కరించారు. ఆమోదం పొందిన వారిలో వివిధ పార్టీలకు చెందిన 8 మంది అభ్యర్థులు, 9 మంది ఇండిపెండెంట్ అభ్యర్థులు ఉన్నారు.

ఆమోదం పొందిన అభ్యర్థులు వీరే..

1. కమ్మిల కన్నప రాజు (కె.కె.రాజు) : వైఎస్సార్‌సీపీ
2. పెనుమత్స విష్ణుకుమార్‌రాజు : బీజేపీ
3. రామారావు లంకరాజు : కాంగ్రెస్ పార్టీ
4. వెంకటలక్ష్మీనారాయణ (జేడీ) : జై భారత్ నేషనల్ పార్టీ
5. పెద్దా కనకమహాలక్ష్మి : బహుజన్ సమాజ్ పార్టీ
6. గుంపల శరత్‌బాబు : సమాజ్ వాది పార్టీ
7. పి.జగదీష్ : జాతీయ జనసేన పార్టీ
8. చింతాడ సూర్యం : నవభారత్ నిర్మాణ్ సేవ పార్టీ

ఇండిపెండెంట్ అభ్యర్థులు

1. ఈశ్వర వీరభద్రాచారి కోనేటి
2. చప్పా రామునాయుడు
3. చింతల మల్లికార్జునరావు
4. బొడ్డు వరహా సత్యశ్రీనివాస్
5. బోర్రా రమేష్
6. రోణంకి చలపతిరావు
7. వడ్డి శిరీష
8. సుమ కమ్మిల
9. యలమంచిలి సాహితి

తిరస్కరణకు గురైన అభ్యర్థులు

1. గొంపా గోవిందరాజు : కాంగ్రెస్
2. గొంపా త్రివేణి : కాంగ్రెస్
3. పెనుమత్స శ్యామలాదీపిక : బీజేపీ
4. కందుల బాలాజీ : ప్రజాప్రస్థానం
5. కరీం మమత : జై భీం పార్టీ
6. ముమ్మనేని సరోజిని : ఇండిపెండెంట్
7. వి.వి.ఎస్.కమలాకర్‌రావు : కాంగ్రెస్

సంక్షేమాభివృద్ధిని చూసి ఓటేయండి


50వ వార్డులో కరపత్రం అందించి ఓటు అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్


25వ వార్డు సీతంపేటలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సారిపల్లి గోవింద్, పార్టీ శ్రేణులు


44వ వార్డు ఎంటీసీ పాలెంలో ప్రచారం చేస్తున్న బాణాల తరుణ్

మద్దిపాలెం: వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజులను గెలిపించాలని కోరుతూ శుక్రవారం ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 50వ వార్డు మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, పార్టీ వార్డు నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బలపరిచిన బొత్స ఝాన్సీ, కె.కె.రాజులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

- 53వ వార్డు రాణాప్రతాప్‌నగర్, మోహిద్దీన్ గార్డెన్స్, శివనగర్-2, మద్దిపాలెం హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఏరియాల్లో కార్పొరేటర్ బర్కత్ అలీ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి తదితర నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బొత్స ఝాన్సీ, కె.కె.రాజులకు మద్దతు తెలపుతూ వారిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

ఇంటింటా ముమ్మర ప్రచారం

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డులో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ముమ్మర ప్రచారం నిర్వహించారు. 100వ బూత్ పరిధిలోని శ్రీనివాసనగర్, 80 ఫీట్ రోడ్, గౌరీ కల్యాణ మండపం ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి వార్డులో, నియోజకవర్గంలో కె.కె.రాజు ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిని, గడప గడపకూ అందించిన సంక్షేమాన్ని వివరించారు. పారువల్లి రవి, వెంకట్ బైరా, సేతల కుమార్, రామారావు, మోరం సూర్యారావు, గౌరి, అడారి విజయశంకర్, చంద్రకళ, కృష్ణవేణి, మాలికరెడ్డి, మండల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 25వ వార్డు కనకమ్మవారి వీధి, గాయత్రి నగర్ ప్రాంతాల్లో కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసి, కరపత్రాలు పంచారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా కె.కె.రాజును, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. మండల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమైన కె.కె.రాజు

వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు మద్దతుగా పార్టీ 44వ వార్డు నాయకుడు బాణాల తరుణ్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వార్డులోని 84 బూత్ పరిధి ముస్లిం తాటిచెట్లపాలెంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఇంటింటి వెళ్లి కరపత్రాలు పంచారు. వార్డులో కె.కె.రాజు చేపట్టిన అభివృద్ధిని వివరించారు. గడిచిన ఐదేళ్లలో నిత్యం ప్రజలతో మమేకమై సేవలందించిన కె.కె.రాజును ఎమ్మెల్యేగా గెలిపించాలని బాణాల తరుణ్ కోరారు. పార్టీ నాయకులు హబీబ్, బషీర్, కాయల రామారావు, వెంకీ, ఇజ్జు సీతారాములు, ముస్తఫా, కన్నా, పోలిరాజు, సత్యనారాయణ, సోఫియా, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.


53వ వార్డులో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ బర్కత్ అలీ, పార్టీ నాయకులు


43వ వార్డు శ్రీనివాసనగర్‌లో కరపత్రం అందిస్తున్న కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ

కళాకారులకు ఆత్మీయ సత్కారం


సత్కారం పొందిన కళాకారులతో అతిథులు

సీతమ్మధార: రంగసాయి నాటక గ్రంథాలయం 12వ వార్షికోత్సవం సందర్భంగా పలువురు కళాకారులకు ఆత్మీయ సత్కారాలు జరిగాయి. టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల గ్రంథాలయంలో శుక్రవారం సాయంత్రం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగస్థల నటీమణి, కందుకూరి, గరుడ అవార్డు గ్రహీత, దర్శకురాలు హంస్సేన్ జహాన్ బేగం, పౌరాణిక కళాకారిణి, సంగీత దర్శకురాలు, నంది అవార్డు గ్రహీత బగాది విజయ సారథి, రచయిత, నటుడు, దర్శకుడు, కందుకూరి బంగారు నంది అవార్డు గ్రహీత, జర్నలిస్టు డేవిడ్ రాజ్, రచయిత, నటుడు, చిత్ర దర్శకుడు, నంది అవార్డు గ్రహీత డాక్టర్ కంద్రాతి సాంబశివరావు తదితరులను ఆత్మీయ సత్కారాలతో గౌరవించారు. కార్యక్రమంలో గ్రంథాలయ వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయితోపాటు పలువురు కళాకారులు పాల్గొన్నారు.

ఐపీఆర్‌లో పీజీ డిప్లొమా కోర్సు


కోర్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మేధో హక్కులపై పీజీ డిప్లొమా కోర్సును ప్రారంభించారు. ఈ మేరకు బ్రోచర్‌ను అంతర్జాతీయ మేధో హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం ఏయూ సెనేట్ మందిరంలో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం అత్యధికంగా పేటెంట్‌లు సాధించిన ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, టి కాన్స్ ఈ నిర్వాహకులు వై.రవికిరణ్, ఆచార్య సి.ఎన్.వి.సత్యనారాయణరెడ్డిలను సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు. అంతర్జాతీయ మేధో హక్కుల దినోత్సవంలో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలను ఈ సందర్భంగా ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ వీసీలు ఆచార్య బీల సత్యనారాయణ, ఆచార్య జి.ఎస్.ఎన్ రాజు, ఆచార్య వి.బాలమోహన్‌దాస్, ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, ప్రిన్సిపాళ్లు, డీన్‌లు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా మద్దతుతోనే ప్లాంట్ అమ్మకాన్ని అడ్డుకున్నా..

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్


మాట్లాడుతున్న కేఏ పాల్

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హై కోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులు జారీ చేసిందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు, విశాఖ ఎంపీ అభ్యర్థి, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి కేఏపాల్ వెల్లడించారు. ఆశీలమెట్టలోని కేఏ పాల్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మద్దతుతోనే ప్లాంట్ అమ్మకం అడ్డుకున్నానని తెలిపారు. హైకోర్టుకు 60 సార్లు హాజరయ్యానని చెప్పారు. ఉక్కు ప్రైవేటీకరణ ఆపానని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో జ్యోతి, ఏసుపాదం రవికుమార్, సుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ రైల్వేస్టేషన్‌లో భువనేశ్వర్ వాసి అదృశ్యం


కర్రి మోహన్‌రెడ్డి

తాటిచెట్లపాలెం: భువనేశ్వర్‌కు చెందిన ఓ వ్యక్తి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో తప్పిపోయినట్లు గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌కు చెందిన కర్రి మోహన్‌రెడ్డి అనే వ్యక్తి కువైట్‌కు పయనమయ్యాడు. ఇందులో భాగంగా ఈ నెల 11న భువనేశ్వర్‌లో రైలెక్కి, విశాఖ రైల్వేస్టేషన్‌లో దిగి కాసేపు తన భార్యతో వీడియో కాల్ మాట్లాడాడు. అనంతరం కొంత సేపటికి ఫోన్ స్విచ్ ఆఫ్ అయినట్లు పోలీసులకు తెలిపారు. అప్పటి నుంచి ఆయా ప్రాంతాల్లో వెతికినా.. ఎక్కడ కనిపించలేదని మోహన్‌రెడ్డి భార్య శుక్రవారం విశాఖ గవర్నమెంట్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. జీఆర్పీ సీఐ.ధనుంజయనాయుడు ఆదేశాల మేరకు జీఆర్పీ ఎస్ఐ జి.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సదరు వ్యక్తి ఇంటి నుంచి బయలుదేరినప్పుడు తెలుపు రంగు టీషర్ట్, నలుపు రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడని, తెలుపు రంగులో సన్నగా ఉంటాడని, ఆచూకీ తెలిసిన వారు విశాఖ జీఆర్పీకి స్వయంగా గానీ లేదా 94406 27547, 98664 13487 నంబర్లలో తెలియజేయాలని ఎస్ఐ కోరారు.